

అమలాపురం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 అమలు

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో అమలాపురం టౌన్, అమలాపురం తాలూకా, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన పోలీస్ స్టేషన్ల పరిధిలో సెక్షన్ 30 అమల్లో ఉందని అమలాపురం డిఎస్‌పి అంబికా ప్రసాద్ తెలిపారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ప్రదర్శనలు వంటివి నిర్వహించరాదన్నారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న ఈ చర్యలకు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - అమలాపురం

ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ హి మాన్షు శుక్లా అన్నారు. ఆదివారం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ప్రాథమిక వైద్య చికిత్స విధానాలపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. 34 మంది అభ్యర్థుల ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక వైద్యంతో చాలా వరకూ ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. అభ్యర్థులు అన్ని విషయాల్లో అవగాహన కల్పించుకోవాలన్నారు. గోదావరి వరదల సమయంలో లంక గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ముంపు బాధితుల ఆరోగ్య పరిరక్షణ చర్యలు పక్కాగా చేపట్టామన్నారు. నలుగురు పాముకాటుకు గురైన సందర్భంలో యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్ ఇచ్చి అర్ధగంటలోపు నిపుణులైన వైద్యుల వద్దకు తరలించడంతో ప్రాణాలతో బయటపడ్డారన్నారు. ప్రాథమిక వైద్య చికిత్స విధానాల పట్ల స్పష్టమైన అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఆయన ధ్రువ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సిహెచ్.సత్తిబాబు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు కె.సత్యనారాయణ కార్యదర్శి పిఎస్.శర్మ మాస్టర్ ట్రైనీలు పాల్గొ న్నారు.



రెడ్‌క్రాస్ సభ్యులతో కలెక్టర్ హిమాన్షు శుక్లా



మండపేటలో సంఘీభావం తెలిపేందుకు వచ్చిన న్యాయవాదులతో ఎంఎల్ఎ వేగుళ్ల

టిడిపి దీక్షలకు న్యాయవాదుల సంఘీభావం

ప్రజాశక్తి - మండపేట

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై పెట్టిన కేసులకు నిరసనగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆదివారం ఆలమూరు బార్ అసోసియేషన్స్ న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కప్పల సునీల్‌కుమార్ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ భారత రాజ్యాంగాన్ని తూట్లు పోడుస్తూన్నారన్నారు. రాజ్యాంగ సంస్థలైన పోలీస్ , సిఐడి వ్యవస్థలను నిర్వీర్యం చేసి జగన్ తన జేబు సంస్థలుగా మార్చుకున్నారన్నారు. చంద్రబాబు అరెస్టు ముమ్మాటికి అక్రమమే అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, షేక్ సల్మాన్, న్యాయవాదులు వేగుళ్ల రామ్మోహన్ కుమార్, గుణ్ణం వీర వెంకట సత్యనారాయణ మూర్తి, నిమ్మలపూడి నారాయణమూర్తి, చంద్రు ప్రకాష్, వి. వెంకట్రావు, అనసూరి గోవిందు పాల్గొన్నారు.

అమలాపురం టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో ఆదివారం రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షను మెట్ల రమణ బాబు, పెచ్చేట్టి చంద్రమౌళి, అల్లాడి సోంబాబు ప్రారంభించారు. ఈ దీక్షలో ఎం.ఫణికుమార్, వై.కుమార్, పి.నర్సిబాబు, కె.రాము, ఎం.సుబ్రహ్మణ్యశర్మ, కె.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - రావులపాలెం, ఆత్రేయపురం

ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రావులపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు సహోపాధ్యాయునిగా పనిచేస్తున్న కప్పల నాగేశ్వరరావును సన్మానించారు. ఈ సన్మానానికి యుటిఎఫ్ నుంచి నాగేశ్వరరావును ఎంపిక చేసి సన్మానించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలోను, ఉత్తమ బోధన అందించడంలో చేసిన కృషికి ఆయన్ని సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. అలాగే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత కెవి.శేఖర్‌ను ఆత్రేయపురం మండలం ర్యాలీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అప్పటి గురువులు కుడిపూడి నాగభూషణం ఆధ్వర్యంలో శేఖర్ మాస్టర్ దంపతులకు సన్మానం చేశారు, ఈ కార్యక్రమంలో విశ్వజనని బుక్ స్టార్ యజమాని ఎం.సూరిబాబు, దివ్య రెడీమేడ్స్ యజమానులు ఎస్.రాంబాబు, ఎస్.సతీష్, శివరామకృష్ణ, మీరా వలీ, ఎస్‌కె మస్తాన్, ఎం.బద్రినారాయణ, కె.శ్రీనివాస్, ఝాన్సీ, ఎన్.బేబికుమారి తదితరులు పాల్గొన్నారు.



నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి

సామాజిక పింఛన్ల అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలో చెముడులంకలో ఉదయం నుంచే సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ పాల్గొని పింఛన్లు అందించారు. ఇదే సందర్భంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దొండపాటి చంటి, మోటూరి సురేష్, బి.వీరవెంకట్రావు, దొండపాటి శ్రీను, సాధనాల నారాయణమూర్తి, విఆర్‌ఎ శ్రీను, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

ఐ.పోలవరం : ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధునికి ఆదివారం పింఛను అందించారు. జి.వేమవరం పంచాయతీ చినకొడప గ్రామానికి చెందిన తిరికోటి నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. యానం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకొన్న వాలంటీర్ కొండేపూడి దుర్గాదేవి ఉదయం 6గంటలకు ఆసుపత్రికి వెళ్లి నాగేశ్వరరావుకు పింఛను అందించింది.

నేడు సర్పంచుల నిరసన

ప్రజాశక్తి - అంబాజీపేట



పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర సమైక్య నాయకులు వైబివి.రాజేంద్రప్రసాద్, లక్ష్మీముత్యాలరావు పిలుపు మేరకు సోమవారం గాంధీ విగ్రహాల ఎదుట నిరసన చేపట్టనున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు నాగాబత్తుల శాంతకుమారి పిలుపునిచ్చారు. ఆదివారం మాచవరంలో ఆయన మాట్లాడారు. సర్పంచులకు నిధులు, విధుల కోసం ఈ పోరాటం జరుగుతుందన్నారు. సోమవారం నిరసన చేపట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

భీమేశ్వరుని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి వి.గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు దేవస్థానం అర్చకస్వాములు, వేదపండితులు, అభిషేక పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ఆయనకు కార్యనిర్వహణాధికారి పితాని తారకేశ్వరరావు భీమేశ్వర స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు.

స్వర్ణోత్సవ వేడుకల్లో మండపేట ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - మండపేట

యుటిఎఫ్ ఏర్పడి 50ఏళ్లు అయిన సందర్భంగా ఆదివారం విజయవాడలో ప్రారంభించిన స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలకు మండపేట నుంచి పలువురు ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. ఉపాధ్యాయుల స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పి.రామచంద్రారెడ్డి, కె.సత్తిబాబు, బి.రాజేంద్ర, కె.ఏసుబాబు, పివివిఎల్ఎన్.మూర్తి హాజరయ్యారు.

తాగునీటి ట్యాంకు పనులకు మంత్రి వేణు శంకుస్థాపన

ప్రజాశక్తి - రామచంద్రపురం

దుగ్గుదూరులో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.4 కోట్లతో నిర్మించే మంచినీటి ట్యాంకు పనులకు బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరికీ తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ట్యాంక్ నిర్మాణం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మాత భారతి, జడ్‌పిటిసి సభ్యులు వనుం వెంకటసుబ్బారావు, వైసిపి నాయకులు ఏసురాజు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

ఐ.పోలవరం : రాష్ట్ర స్థాయి హ్యాండ్ పోటీలకు ఎంపికైన స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు కొమ్మన హాసిని సత్యసుధ, యు.యవశ్రీ, అప్పాడి కళ్యాణిలను పలువురు అభినందించారు. ఇటీవల కాకినాడలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో వీరు పాల్గొన్నారు. వాలీబాల్, హ్యాండ్ బాల్ విభాగాల్లో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వీధి సురేష్‌బాబు తెలిపారు. వీరిని సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, సొసైటీ చైర్మన్ విత్తనాల శ్రీనివాసరావు, పిఎంసి చైర్మన్ రేవు ధనలక్ష్మి, తహశీల్దార్ ఝాన్సీలక్ష్మి, ఎంపిడిఒ డి.రాంబాబు, మండల విద్యాశాఖ అధికారులు కొండా రెడ్డి, తిరుమలరావు, పాఠశాల సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, పీడీ పోతుల సురేష్ బాబు పాల్గొన్నారు.

అన్నదాన భవనానికి విరాళాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకన్న ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదానం భవన నిర్మాణానికి ఆదివారం పలువురు విరాళాలు అందించారు. రాజోలుకు చెందిన జి.సూర్యనారాయణమూర్తి, సూర్య సుభద్ర దంపతులు రూ.10,600, కొవ్వూరుకు చెందిన నాయుడు సుధశ్రీ రూ.10 వేలు, అనకాపల్లికి చెందిన కె.రాము, వెంకటలక్ష్మి దంపతులు రూ.10,166, గణపవరానికి చెందిన కెవి.రమేష్‌బాబు, వరలక్ష్మి దంపతులు రూ.18వేలు, విజయవాడకు చెందిన ఎస్.దీపక్ రూ.10,222, గండేపల్లికి చెందిన గణేష్, దుర్గాదేవి దంపతులు రూ.11,116, తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలేనికి చెందిన గిద్ద వీరరాఘవులు,ధనలక్ష్మి దంపతులు రూ.50,116, ఆకివీడు మండలం ఐ.భీమవరానికి చెందిన ఎం.దుర్గారావు, కుమారి దంపతులు రూ.20వేలు, తొండంగి మండలం ఎవి.నగరానికి చెందిన పిఎన్ఎస్.మంజుషా రూ.10వేలు, వెదిరేశ్వరానికి చెందిన వి.నాగమల్లేశ్వరరావు వెంకట పద్మ దంపతులు10 సీలింగ్ ఫ్యాన్లు అందించారు. వీరికి ఆలయ చైర్మన్ రమేష్‌రాజు, ఇఒ సత్యనారాయణరాజు స్వామి వారి చిత్రపటాలను అందించారు.

విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం

ప్రజాశక్తి -ఐ.పోలవరం

పాత ఇంజరం పంచాయతీ పరిధిలో ఉన్న యానాం -ఎదుర్లంక వారధి వద్ద నూతనంగా నిర్మిస్తున్న పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి ఫిషర్ మెన్ కాలనీకి చెందిన వీరాంజనేయ సొసైటీ అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. ఆదివారం ఎంఎల్ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు ఈ మొత్తాన్ని అందించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ విగ్రహ నిర్మాణం వేగవంతంగా జరుగుతుందన్నారు.

కార్టూ'నిజం'



జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతాహి సేవా

ప్రజాశక్తి - యంత్రాంగం

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధుల, అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను చేపట్టారు. **అమలాపురంలో** స్వచ్ఛతాహి సేవాలో భాగంగా గడియారస్తంభం సెంటర్ నుంచి ముమ్మిడివరం గేటు వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ హిమాన్షుశుక్లా ప్రారంభించి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా 50 శాతం రోగాలు ప్రబలకుండా రక్షణ పొందొచ్చని అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛ భారత్ అభియాన్ లో భాగంగా స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని గత నెల 15వ తేదీ నుంచి గాంధీ జయంతి వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సముచితమైన రీతిలో పరి శుభ్రతతో కూడిన వాతావరణాన్ని సృష్టించాలని పురజనులకు పిలుపు నిచ్చారు. స్వచ్ఛతా కార్యక్రమాలను వేగవంతం చేయాలని స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులకు సూచించారు. జిల్లాలో పలు చోట్ల ప్రతి గ్రామంలో రెండు చోట్ల ఈ స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గత నెల 30 నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ విఐపి.నాయుడు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. **మండపేట** మండలం తాపేశ్వరంలో సర్పంచ్ వాసంశెట్టి రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో స్వచ్ఛత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాటర్ ట్యాంకు, డ్రెయినేజీల వద్ద చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **కె.గంగవరం** మండలంలోని కూళ్ల, పాణింగపల్లి గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. కూళ్ల సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు, పాణింగపల్లి సర్పంచ్ సునీత గోపాలం ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా డ్రైనేజీలను ,రోడ్లను, మంచినీటి ట్యాంకులను పరిసరాలను శుభ్రపరిచారు అనంతరం బ్లీచింగ్ జల్లి స్వచ్ఛత పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లి నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పారిశుధ్యం పై పరిసరాలపై అవగాహన కలిగి ఉండాలని పరిశుభ్రత వ్యాధులను దూరం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు. శివల గ్రామంలో సర్పంచ్ అనసూరి సాయిబాబు ఆధ్వర్యంలో పెదరామాలయం వీధి, చిన్న రామాలయం వీధిల్లో వాటర్ ట్యాంక్, డ్రెయినేజీలను శుభ్రం చశారు. పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. దంగేరులో సర్పంచ్ కొప్పిశెట్టి వెంకటరమణ, ఎంపిటిసి సభ్యులు లక్ష్మణ్, కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **అమలాపురం రూరల్** మండలం కామనగరువులో సర్పంచ్ నక్కా అరుణకుమారి ఆధ్వర్యంలో గార్బేజ్ లిఫ్టింగ్ పనులు చేపట్టారు. పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు, వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీహరి, డిజిపిఒ వి.కృష్ణకుమారి, డిఎల్‌పిఒ జి.మల్లికార్జునరావు, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, ఎంపిటిసి సభ్యులు మెండు గంగాభవాని, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. అలాగే పేరూరులో సర్పంచ్ దాసరి అరుణ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప సర్పంచ్ కుడిపూడి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు దొంగ ఆంజనేయులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తంలో** మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. విలసవిల్లి, గొల్లవిల్లి, గోపవరం తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు సలాది ఊర్మిళదేవి, జొన్నాడ శ్రీదుర్గ, కుంచే బుల్లియ్య, నాయకులు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొని ర్యాలీలు నిర్వహించారు.



అమలాపురంలో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షుశుక్లా ఇతర అధికారులు, విద్యార్థులు



ఐద్వా ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహిళలు

ఐద్వా ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

'మోడీ హటావో నారీ బచావో దేశ్ బచావో' ఉద్యమ పిలుపులో భాగంగా ఆదివారం అమలాపురం మండలం బండారులంకలో ఐద్వా ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మను ధర్మాన్ని ప్రతిఘటిద్దాం, మహిళా హక్కులు రక్షించుకుందాం అని నినదించారు. 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

అప్పలాచార్యకు పలువురి సంతాపం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మయూర నాటక కళాపరిషత్ వ్యవస్థాపకులు శృంగవరపు వెంకట అప్పలాచార్య(78) మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయన ఆదివారం మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్యకు అప్పలాచార్య కార్యదర్శిగా పనిచేశారు. కళలకు, వృత్తి కళాకారులకు అనేక సేవలు అందించారన్నారని నాటకాల పరిషత్ అధ్యక్షులు నాగిరెడ్డి సతీష్ తెలిపారు. మయూరి నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నాటక పోటీలను ఆయన మయాంలో నిర్వహించారు. కళాపరిషత్ కార్యదర్శి సినీనటి సరోజ, కోశాధికారి రాంబాబు, రామచంద్రపురం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్.దేవానందం, కార్యదర్శి వరప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఆయన మతికి సంతాపం తెలిపారు.

పార్కుకు వాటర్ డిస్పెన్సర్ అందజేత

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనానికి అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో రూ.40 వేల విలువ గల వాటర్ డిస్పెన్సర్‌ను అమలాపురం డిఎస్‌పి అంబికాప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. అల్లూరి రమేష్‌రాజు, మేడిచర్ల త్రిమూర్తులు, కె.వెంకటరెడ్డి, వీరా తాతాజీ, కొమ్మూరి వెంకటాచలప్రసాద్, బోణం సత్యవరప్రసాద్ సహకారంతో దీన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాయుడు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, కౌన్సిలర్ ఆశెట్టి విజయదుర్గ, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి అదిబాబు, చాంబర్ అధ్యక్షులు బోనం సత్వరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్ ట్రెజరర్ దొమ్మేటి సాయిబాబు, చాంబర్ గౌరవాధ్యక్షుడు అల్లాడి స్వామినాయుడు పాల్గొన్నారు.

దేవాంగ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం బండారులంకలో కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం సంఘ అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్య స్వామి అధ్యక్షత న జరిగింది. సంఘ ప్రధాన కార్యదర్శి పుత్సల వరదరాజులు వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. 2021-22 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 500 పైబడి మార్కులు సాధించిన దేవాంగ విద్యార్థులకు చందన కేదారీష్ దంపతులు, సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, ఊటుకూరి వీరబ్రహ్మం చారిటబుల్ ట్రస్ట్, సంఘం నిధుల ద్వారా సేకరించిన రూ.56 వేలను అందించారు.కోనసీమలో వివిధ గ్రామాలకు చెందిన సుమారు 28 మందికి రూ.2 వేలు చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలోలో పిచ్చిక పోలేశ్వరరావు, దైవపు నందయ్య, ములికి విఘ్నేశ్వరుడు, కారుపర్తి గిరిజాపతి, లక్కింశెట్టి వీరన్న, చింతా రత్నబాబు, జాన పాలాక్షుడు,యక్కల మెహర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలయోగి జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

లోక్‌సభ మాజీ స్పీకర్ జిఎంసి.బాలయోగి జయంతిని జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **అమలాపురంలో** బాలయోగి 72వ జయంతి ఆయన కుమారుడు హరీష్‌మాథూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నల్లవంతెన సమీపంలోని బాలయోగి ఘాట్‌లోని నివాళులు అర్పించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల అనందరావు, నాయకులు మెట్ల రమణబాబు తదితరులు బాలయోగికి నివాళులర్పించారు. గత సంవత్సరం బాలయోగి జయంతి సందర్భంగా చంద్రబాబు ఆదేశాల మేరకు హరీష్ బాలయోగి ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు నేటితో ఏడాది పూర్తి చేసుకుందని హరీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** టిడిపి కార్యాలయంలో బాలయోగి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు పోతుల మాధవ్ మాట్లాడారు. దళితుడైన బాలయోగి లోక్ సభ స్పీకర్ గా ఎన్నికై చరిత్ర సృష్టించారన్నారు. యానాం వారధికి బాలయోగి పేరు పెట్టి ఆయన పేరును సార్థకం చేసిన ఘనత టిడిపికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తంలో** బాలయోగి పార్కులోని బాలయోగి విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పోలిశెట్టి భాస్కరరావు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, చిక్కం పెద్దబ్బులు, గొలకోటి సత్తిరాజు, పెయ్యల దుర్గారావు, రవణం మధు, సలాది శ్రీనివాసరావు, మధుర ప్రతాప్, చీకట్ల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి** మండలం కె.జగన్నాథపురం ఉమామహేశ్వర ఉన్నత ప్రజా పరిషత్ పాఠశాల ఆవరణలో జిఎంసి బాలయోగి చారిటబుల్ సొసైటీ-1999 అధ్యక్షులు అక్కిశెట్టి దుర్గారావు అధ్యక్షతన జయంతి సభ నిర్వహించారు. బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ముఖ్య అతిథులుగా వ్యవస్థాపక అధ్యక్షులు గంగుమళ్ళ శ్రీనివాస్, దళిత సంఘాల నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు నల్లా చిన్నబాబు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీల నాయకులు నల్లా సత్తిబాబు, నల్లా శ్రీను, సూదా వెంకటేశ్వరరావు, నల్లా పళ్లాలు, అల్లం సతీష్‌కుమార్, సత్యనారాయణ, కొండేటి నాగేశ్వరరావు, జి.దుర్గారావు, సాంబారి సాయి తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం బాలయోగి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మాథూర్ తదితరులు

'దీప్తి' విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి - మామిడికుదురు

ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా దీప్తి విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం శ్రమదానం చేశారు. కళాశాలల పరిసరాల్లో, మామిడికుదురు పరిసరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు శ్రమదానం చేసి చెత్తను తొలగించారు. మిత్ర మొక్కలను నాటారు. పరిసరాల్లోకి దోమలు, విష కీటకాలు చేరకుండా బ్లీచింగ్ చల్లారు. దీప్తి విద్యాసంస్థల చైర్మన్ డివివి.సత్యనారాయణ మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని తద్వారా స్వచ్ఛ సమాజాన్ని సాధ్యం చేయాలంటే ప్రతి ఒక్కరూ శ్రమ దానాన్ని స్ఫూర్తి మంత్రంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్. ప్రతినిధులు జక్కంపూడి శివప్రసాద్, మోకా రంగారావు, అడబాల ఈశ్వరరావు, వాసంశెట్టి నాగరాజు, వీరా కొండలరావు, కడలి మురళి శ్రీనివాస్, చెల్లుబోయిన ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కాల్వలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కాలువలో స్నానం చేస్తూ ప్రమాదవశాస్తు మునిగిపోయి ఒక వ్యక్తి చనిపోయిన సంఘటన మండలంలోని అంకంపాలెంలో చోటు చేసుకుంది పోలీసు వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన కరుటూరి శ్రీరామ ప్రసాద్ (40) ఆదివారం ఉదయం గ్రామ శివారులో ఉన్న శివాలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లాడు పక్కనే ఉన్న కాలువలోకి స్నానానికి దిగాడు ప్రమాదవశాస్తు మునిగి పోయి మృతి చెందాడు దీనిపై, భార్య వెంకట దుర్గ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు.

పురుగు మందు తాగిన బాలుడు మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

తండ్రి మందలించడంతో, మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన సాధనాల గోవింద్ (15) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గోదావరిపై ఉన్న గ్యామన్ ఇండియా బ్రిడ్జిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందారు. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలు.. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం అర్తమూరుకు చెందిన నిడదవోలు రమణ తన భార్య వీరలక్ష్మి (32), కుమారుడు వెంకట్‌తో కలిసి బైక్‌పై దేవరపల్లి మండలం గౌరీపట్నం బయల్దేరారు. వీరి బైక్‌ను ఓవర్ టేక్ చేయబోయిన లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో వీరలక్ష్మి అక్కడికక్కడే మతి చెందింది. కుమారుడు వెంకట్‌కు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఎంపి మార్గాని భరత్ రామ్ ఆగి అంబులెన్స్‌కు ఫోన్ చేసి హుటాహుటీనా ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి వంతెన సమీపంలో జాతీయ రహదారి 216పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోరంగి పంచాయతీ బొడ్డు చినవెంకటాయపాలెం గ్రామానికి చెందిన పాలెపు సత్తిబాబు (32) కాకినాడ నుంచి బైకుపై వస్తుండగా యానాం వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం

డిఎం అండ్ హెచ్ఓ నరసింహ నాయక్





ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వర్షాకాలం వాతావరణంలో మార్పులు, పరిసరాల అపరిశుభ్రత వంటి కారణాలతో వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి మెరుగైన వైద్య చికిత్స పొందడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నరసింహ నాయక్ పేర్కొన్నారు. కాలానుగుణ వ్యాధుల నివారణ, చికిత్సలపై ఆయన వివరించారు.

జిల్లాల్లో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. 140 పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. ముందుగా గ్రామంలోని ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలను సంప్రదిస్తే ప్రాథమిక చికిత్స అందిస్తారు. ఆరోగ్య ఉపకేంద్రాలకు వెళితే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. కలుషితమైన నీరు లేదా ఆహారం తీసుకోవడం వల్ల ఇలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. నీరసంగా ఉంటే అవసరమైతే ఆసుపత్రిలో జాయిన్ చేసుకొని మెరుగైన వైద్య అందిస్తారు.

మలేరియా, టైఫాయిడ్ నిర్ధారణకు పరీక్షలు ఎక్కడ చేస్తారు. ఫలితాలు ఎప్పుడు వస్తాయి.

గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో ప్రాథమికంగా జ్వరాలకు మందులు ఉచితంగా ఇస్తారు. జ్వరం తగ్గనట్లయితే లక్షణాల మేరకు మలేరియా సంబంధించి రెండు రకాల పరీక్షలు ఉంటాయి. మొదటగా ఆర్‌టిపిసిఆర్ చేసి వెంటనే చెబుతారు. అనుమానముంటే రక్తనమూనా సేకరించి ల్యాబ్‌కు పంపిస్తారు. టైఫాయిడ్ నిర్ధారణకు కూడా రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డయాగ్నస్టిక్ సెంటర్‌కు పంపిస్తారు. మరుసటి రోజే ఫలితం వస్తుంది. రోగి చరవాణికి కూడా సమాచారం వస్తుంది.

రెండుసార్లు కరోనా పాజిటివ్ వచ్చినా మరోసారి వస్తే ఏమైనా ప్రమాదం ఉంటుందా.

రెండుసార్లు పాజిటివ్ వచ్చినా వారిలో ఉన్న రోగ నిరోధక శక్తిని బట్టి కొందరు ఆరోగ్యంగా ఉంటారు. మరికొందరు బలహీనంగా కనిపిస్తారు. పౌష్టికాహారం, పండ్లు తీసుకోవాలి. అజాగ్రత్తగా ఉంటే కరోనా పలుమార్లు రావచ్చు. ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. వైద్యులను సంప్రదించడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

జ్వరం వచ్చి నీరసంగా ఉన్నా.. ప్లేట్ లెట్లు తక్కువగా ఉన్నా..ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స చేస్తారా

ప్లేట్లెట్స్ తక్కువగా ఉన్నాయని భయాందోళన వద్దు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరితే చికిత్స ప్రారంభిస్తారు. అన్న రకాల వ్యాధులకు మెరుగైన చికిత్స అందిస్తున్నాం.

కాలానుగుణ వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలి. నిరుపయోగంగా ఉన్న కుండీలు, టైర్లు, ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు నిలువకుండా చూడాలి. దోమలు నిర్మూలించే చర్యలు తీసుకోవాలి.

చిన్న పిల్లల విష్యంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు ఏమిటి

వర్షాలు ఎక్కువగా పడుతున్నందున చిన్న పిల్లల రోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వేడి చేసి చల్లార్చిన నీటినే తాగించాలి. వాంతులు, విరేచనాలు అయితే పిల్లలు నీరసపడకుండా చూసుకోవాలి. రెండు, మూడు రోజుల్లో జ్వరం, జలుబు తగ్గకపోతే డాక్టర్ దగ్గరికి వెళ్లాలి.

యానాం వార్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జయప్రకాష్ నారాయణ, లక్ష్మీనారాయణ

ఘనంగా ఓల్డేజ్ హోమ్ రజతోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో యానాం వద్ధాశ్రమ 25 వసంతాల వేడుక ఘనంగా నిర్వహించారు. యానాం వద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాడి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా లోక్ సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ, సిబిఐ మాజీ డైరెక్టర్ జెడి.లక్ష్మీనారాయణ, న్యాఢిల్లీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అన్బురసు, వైజాగ్ ప్రొఫైల్ చైర్మన్ ఇ.శంకర్రావు హాజరయ్యారు. యానాం వద్ధాశ్రమాన్ని సందర్శించిన వీరు పలు నూతన వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులతో మాట్లాడారు. అనంతరం అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథులు మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను వృద్ధాశ్రమ నిర్వహణ కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పెసల గిడ్ల చంద్రావు, పెండెం సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అధికారులు

ఘనంగా జిఎంసి బాలయోగి జయంతి

ప్రజాశక్తి - యానాం

యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో జిఎంసి బాలయోగి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పరిపాలన అధికారి కార్యాలయం సమీపంలో ఉన్న బాలయోగి విగ్రహానికి సిఐ షణ్ముగం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి గణేషన్, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, చెక్కల అరుణ్ కుమార్, కెఎల్‌వి.ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



మాట్లాడుతున్న పళ్లం రాజు

పంతం పద్మనాభం స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగే 22వ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు ఆదివారం సూర్యకళామందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత నీలకంఠ నృత్యనికేతన్ కాకినాడ వారి ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు జరిగాయి. అనంతరం రాత్రి ఆకాశం శ్రీరామచంద్రమూర్తి కళాప్రాంగణాన్ని డాక్టర్ చెలికాని స్టాలిన్ ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి బుర్రా పద్మనాభం అధ్యక్షతన జరిగిన సభలో సంస్థ అధ్యక్షుడు, మాజీ కేంద్ర మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు, ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి, రాయప్రోలు భగవాన్, పంతం గాంధీమోహన్, పంతం నెహ్రూ, మార్ని జానకిరామ్ చౌదరి, బోణం వెంకట భాస్కర్, సరస్వతి గానసభ కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, పంతం పద్మనాభం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుర్రా పద్మనాభం మాట్లాడుతూ పంతం పద్మనాభం ప్రోత్సాహంతో ఆయన సాధనకోసం సంస్థను ప్రారంభించి, గత 24 సంవత్సరాలుగా నిర్విరామంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో కళాకారులు, రంగస్థల కళారంగాన్ని ప్రోత్సహించడమే తమ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పంతం పద్మనాభం గ్రామాల్లో కళాకారులను ప్రోత్సహించి, ఎంతగానో ఆదరించేవారన్నారు. ఆయన స్ఫూర్తిని బుర్రా పద్మనాభం కొనసాగించడం ఎంతో అభినందనీయమన్నారు.

క్లాప్ మిత్రలకు కలెక్టర్, ఎంపీ సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పరిశుభ్రవంతమైన సమాజం కోసం ఆరోగ్యవంతమైన జీవితం కోసం స్వచ్ఛత ఈ సేవ శ్రమదానం ప్రతి ఒక్కరూ ఉద్యమంలో చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, కాకినాడ ఎంపీ వంగా గీత పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు స్వచ్ఛతాహి సేవ శ్రమదానం, క్లాప్ మిత్రలకు సత్కారం, క్లాప్ మిత్రలతో తేనీ టి విందు వంటి కార్యక్రమాల్లో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఎంపీ వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తదితరులు అచ్చంపేట గ్రామ పంచాయితీలో ఆదివారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం చేపట్టారు. అనంతరం క్లాప్ మిత్రలకు సన్మానం చేసి, కాఫీ విత్ క్లాప్ మిత్రా, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ రమణారెడ్డి, డిఎల్‌డిఒ పి.నారాయణ మూర్తి, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, ఇఒపిఆర్‌డి కె.హరికృష్ణ సత్యారెడ్డి పాల్గొన్నారు.



క్లాప్ మిత్రలతో తేనీరు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

జోరుగా అన్నదానాలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

వినాయక చవితి నవ రాత్రుల ముగింపును పురస్కరించుకుని ఆదివారం జోరుగా అన్నదానాలు నిర్వహించారు. తొలుత సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాదాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, టిడిపి నాయకులు గుమ్మళ్ల రామకృష్ణ, చల్లా బుజ్జి ప్రారంభించారు. సుమారు 1000 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. గణేష్ కాలనీలో కౌన్సిలర్ మర్రి శేషారావు, పాలిక చంటిబాబు ఆధ్వర్యంలో 500 మందికి భోజనాలు అందజేశారు.

దస్తావేజులు పోయినవి

తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం రూరల్, కాతేరు గ్రామానికి చెందిన శీలం నాగేశ్వరరావు గారి కుమారుడు శీలం వీర వెంకట సత్యనారాయణకు చెందిన సర్వే నెంబరు 19-2లో గల 226.89 చ॥గ॥ డాబా ఇల్లుకు సంబంధించిన 1917/2001 నెంబర్ గల ఒరిజినల్ లింక్ దస్తావేజులు మండల కేంద్రమైన కడియం సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న జిరాక్స్ సెంటర్ నుండి కడియం క్యాథలిక్ సిరియన్ బ్యాంక్ మార్గ మధ్యములో పడిపోయినవి. దస్తావేజులు దొరికిన వారు క్రింది చిరునామాకు సంప్రదించాలని కోరుతున్నాము.

శీలం వీర వెంకట సత్యనారాయణ
సాయిబాబా గుడి వద్ద, కాతేరు,
రాజమహేంద్రవరం రూరల్, తూ॥గో॥జిల్లా.
సెల్: 95156 48878

సిపిఎంపై సజ్జల వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి-పిఠాపురం

సిపిఎం, కమ్యూనిస్టులపై ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని సిపిఎం నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక నండూరి ప్రసాదరావు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు సిద్ధాంతపరంగా పనిచేస్తారు తప్ప ఎవరికీ తాబేదారులుగా పని చేయరని హితవు పలికారు. కమ్యూనిస్టు భావజాల కుటుంబం నుంచి వచ్చి ఉన్నతమైన పదవిలో ఉన్న సజ్జలకమ్యూనిస్టు సిద్ధాంతాలు పూర్తిగా తెలుసుకొని మాట్లాడాలి తప్ప ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ కుంచే చిన్న, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, కె.నాగేశ్వరరావు ఉన్నారు.

రోటరీ సహకారంతో వైద్య శిబిరం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం రోటరీ క్లబ్ అధ్యక్షులు యడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచితంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మెడికవర్ హాస్పటల్ సహకారంతో ప్రాజెక్ట్ ఆన్‌పాజిటివ్ హెల్త్ ద్వారా రోగులకు వైద్య నిపుణులు వంశీకృష్ణ, రాజేష్ బిపి, సుగర్, వయసును బట్టి బరువు, ఎత్తు గుండెకి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కొండా వేణుగోపాల్‌రావు, అరగల తాతయ్య, జి.వెంకట్, డాక్టర్ శ్రీకాంత్, కేశవరాజు, డి.శంకర్, బి.భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - ఆలమూరు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలో బూత్ లెవల్ అధికారులు ఆధ్వర్యంలో 80 ఏళ్ల వద్దులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆలమూరులో పంచాయతీ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఐపి.శెట్టి సమక్షంలో, జొన్నాడలో సర్పంచ్ కట్టా శ్రీనివాస్, పెదపళ్లలో సొసైటీ చైర్మన్ నెక్కంటి బుజ్జి సమక్షంలోనూ వృద్ధులను సత్కరించారు. పూలమాలతో ఘనంగా సన్మానించి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు నాతి కుమార్‌రాజా, మెహర్ ప్రసాద్, లోవ సత్యనారాయణ, విఆర్‌ఒలు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పెద్దాపురం

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షునిగా వేముల అర్జున్ రావు, ఉపాధ్యక్షునిగా గుండేపల్లి బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా కడకుదిటి వెంకట శివ సుధాకర్, సహాయ కార్యదర్శిగా ధవళేశ్వరపు సత్తిబాబు, కోశాధికారిగా ముండూరు వెంకట్రావు, ప్రమాణ స్వీకారం చేశారు. తాళాబత్తుల సాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్, గడిగట్ల సత్తిబాబు, ఎన్.సూరిబాబు, కోరుకొండ వరహాలరావు, సింహాద్రి కామేశ్వరరావు, కోరుకొండ విజయ్, టి.రాజా, చిట్టిమోజు శ్రీను, లక్ష్మీనారాయణ, కింతాడ శ్రీను, ప్రశాంత్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం రహిత సమాజం కోసం ర్యాలీ

ప్రజాశక్తి-పిఠాపురం

గోకివాడలో ఆదివారం గాంధీ జయంతిని పురస్కరించుకుని మద్యపానరహిత సమాజంగా తీర్చిదిద్దాలని మహిళలు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మద్యం వద్దు ఆరోగ్యం ముద్దు అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మద్యం వల్ల అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ జయంతి ఒక రోజుకే మద్యం షాపులు బంద్ చేసి మిగతా రోజుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరపడంతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్యం మహమ్మారిని పూర్తిగా నిషేధించినప్పుడే జాతిపితకు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక పోరాట నాయకులు వల్లూరి పద్మ, వేమగిరి తలుపులియ్య, వేమగిరి, మరియమ్మ, గౌరి, వెంకటలక్ష్మి, చిన్నారి, భవాని పాల్గొన్నారు.



మద్యానికి వ్యతిరేకంగా నినదిస్తున్న మహిళలు

దిగిరాని అల్లం ధర.. కేజీ రూ.150

మండపేట : నెలలు గడుస్తున్న అల్లం ధర కిందకు దిగి రావడం లేదు. హోల్ సేల్ మార్కెట్లో కేజీ రూ.120 కాగా రిటైల్ మార్కెట్‌లో కేజీ రూ.150కి పైగా పలుకుతోంది. ప్రధానంగా ప్రజల అవసరాల మేరకు స్థానికంగా అల్లం అందుబాటులో లేదు. దీంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో అల్లం ధర అధికంగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధాన మార్కెట్లో కేజీ రూ.150 నుంచి రూ.160 పలుకుతోంది.

ఇండోర్ గేమ్స్‌పై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఇండోర్ గేమ్స్, కథలు చదవడం, సమీక్షలు చేయడం వంటి కార్యక్రమాలపై బాలలకు ఆదివారం మాధవపట్నంలోని జమునానగర్ కాలనీ బాల మందిరంలో నిర్వహించారు. బాల మందిరం వ్యస్థాపకులు అంగర గోపాలకృష్ణ అధ్యక్షతన మెంటార్ హేమంత్ విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించగా, కాప్ప టీచర్ వీరబాబు విద్యార్థులకు చిత్రలేఖనం, ఒరిగామి అంశాలపై తరగుతులు నిర్వహించారు. దసరా సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు కృష్ణశ్రీ తెలిపారు. ఈ నెల 14, 15 తేదీలు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్, చెస్ విభాగాల్లో ఈ ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

IN THE COURT OF HONOURABLE V ADDL. JUNIOR CIVIL JUDGE AT RAJAMAHENDRAVARAM
O.S No.313/2022

Between:
State Bank of India, RASMEC & SARC, Rajahmundry, Rep. by its Manager. ***...Plaintiff***
AND
Kokkiri Kavya Sri ***...Defendant***
SUMMONS TO:
Kokkiri Kavya Sri, D.NO: 85-9-3, Near Chakradhar Hospital, V.L.Puram, RAJAHMUNDRY - 533107.

Please take notice that the above plaintiff filed the suit against you for recovery of an amount Rs 1,06,134/- together with subsequent interest and other reliefs. The above suit stand posted to **06-10-2023 for your appearance** either in person or through a pleader on the above mentioned date in the said court at 10.30 A.M to answer the claim, failing which the matter will be disposed off as per law.

KANDUKURI SRINIVAS
SBI Panel Advocate,
Rajamahendravaram.
Cell: 90595 49017

Sale Notice Under Order 21 Rule 66 of C.P.C
మహారాజశ్రీ ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 3/2017 in O.S.No. 68/2004

బిట్వీన్:
మొల్లేటి సత్యనారాయణ ***...డి. హెచ్. ఆర్***
అండ్
బొంతు పల్లంశెట్టి ***...జె.డి. ఆర్***
టు: బొంతు పల్లంశెట్టి, తండ్రి: కొండయ్య, గేదెల్లంక గ్రామం, ముమ్మిడివరం మండలం.

ఈ పై నెంబరు ఇ.పి.ను డి.హెచ్.ఆర్. మీపై డిక్రీ బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేసి మీకున్న ఇ.పి. దాఖలా ఆస్థి య.0-05 సెంట్లు స్థలం మరియు ఇంటిని వేలం వేయించి బాకీ వసూలు ఇప్పించమని కోరుచూ దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు వేలం నోటీసులు అమలు నిమిత్తం మరియు మీ హాజరు నిమిత్తం వాయిదా **ది.06-10-2023వ తేదీ అయి ఉన్నది. కావున మీరు వాయిదా రోజున ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను.** అట్లు కాని ఎడల మీ పరోక్షమందున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
ముమ్మిడివరం, అడ్వకేట్స్, ముమ్మిడివరం.
26-9-23. సెల్: 94400 41751

జిఎంసి బాలయోగికి ఘన నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోనసీమతో పాటు జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మాజీ పార్లమెంట్ స్పీకర్ జిఎంసి బాలయోగి సేవలు ఆదర్శనీయమని పలువురు తెలుగుదేశం నేతలు అన్నారు. బాలయోగి 72వ జయంతి సందర్భంగా తాళ్లరేవు, నీలపల్లి, యానాం వారధి వద్ద బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా తాళ్ళరేవు అంబేద్కర్ భవనం వద్ద బాలయోగి విగ్రహానికి టిడిపి నాయకులు జక్కల ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు నివాళులర్పించారు. నీలపల్లిలో చిట్టూరి కలికి మూర్తి, యానాం వారధి వద్ద ఉన్న బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాట్ల పృథ్వీ, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, జక్కల ప్రసాద్ బాబు, మోపూరి వెంకటేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, గంజా సూరిబాబు, గంట గోపి, వస్కా రెడ్డి, వెంటపల్లి చంద్రమౌళి, వాసంశెట్టి శ్రీనివాస్, రోళ్ల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో నివాళులర్పిస్తున్న నాయకులు

పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - అంబాజీపేట

సంక్షేమ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు బిసి హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం హాస్టల్ వసతులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాండ్రేగల శ్రీనివాసరావు, పేరి శ్రీను, పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యవేణి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్‌లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగానికి చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థి కె.దుర్గాప్రసాద్ జూనియర్ అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రతిభ చూపాడు. ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరు ఆధ్వర్యంలో ఐజిఎంసి స్టేడియం విజయవాడలో నిర్వహించిన 36వ ఎపి రాష్ట్ర స్థాయి అండర్-23 జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 400 మీటర్ల రన్నింగ్ రిలేలో సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. దుర్గాప్రసాద్‌ను ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి జి.ప్రతాప్ రెడ్డి, కోచ్ వి.అఖిల్ అభినందించారు.

మహారాజశ్రీ 2వ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం
O.S.No.17/2013

Between:
1) Vemana Alias Mandapalli Lakshmi Krupakar
2) Mandapalli Vijaya
3) Mandapalli Sagar Sastry ***...Plaintiffs***
AND
Sabitha Krupa Grace and Others ***...Defendents***

D-7: Regani Jayamma, C/o. Late Sathiraju, Hindu, Occupation House Wife, D.No.61-7-11/4, P&T Colony, Near Baba Tample, Rajahmundry RJY JCJC.
D-8: Regani Lakshmi, C/o. Late Sathiraju, Hindu, Occupation House Wife, D.No.61-7-11/4, P&T Colony, Near Baba Tample, Rajahmundry RJY JCJC.

పై నెంబరు దావాలో 7, 8 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్ప వేయుచున్నారు. కావున ది.05-10-2023 సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని ఎడల సదరు దావా మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎస్.శ్రీరామచంద్రమూర్తి
రాజమండ్రి, అడ్వకేట్, శ్యామలా నగర్,
01-10-2023. రాజమండ్రి.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి అమలాపురం వారి కోర్టులో
E.A.No. 293/2022
E.P.No. 68/2015, O.S.No. 65/2014

బిట్వీన్:
ప్రెసింగి అప్పారావు ***...పిటీషనరు /డి. హెచ్. ఆర్***
అండ్
1) గొట్టిముక్కల వీరభద్రరాజు (డైడ్)
2) గొట్టిముక్కల బేబి
3) గొట్టిముక్కల వర్మ
4) గొట్టిముక్కల ప్రసాద్
...రెస్పాండెంట్లు / 2 టు 4 ప్రపోజ్డ్ పార్టీలు
టు: 2) గొట్టిముక్కల బేబి, భర్త: లేటు వీరభద్రరాజు, టి.కొత్తపల్లి, ఐ.పోలవరం మండలం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.
3) గొట్టిముక్కల వర్మ, తండ్రి: లేటు వీరభద్రరాజు, టి.కొత్తపల్లి, ఐ.పోలవరం మండలం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.
4) గొట్టిముక్కల ప్రసాద్, తండ్రి: లేటు వీరభద్రరాజు, టి.కొత్తపల్లి, ఐ.పోలవరం మండలం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

ఈ పై నెంబరు ఇ.పి.68/2015, ఓ.ఎస్.65/2014 ప్రొసీడింగ్స్‌లో 1వ రెస్పాండెంటు /జె.డి.ఆర్. వీరభద్రదరాజు చనిపోయినందున వాని వారసులుగా 2 టు 4 రెస్పాండెంట్లును ప్రపోజ్డ్ పార్టీలుగా చేర్చమని కోరుచూ ఇ.ఎ.నెం. 293/2022 నెంబరున పిటీషనరు Under Section 50 Or 21 R106(2) CPC పిటీషను దాఖలు చేసినారు. **ది.19-10-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు 2 టు 4 రెస్పాండెంట్లు పైన తెలిపిన వారి కోర్టులో స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపరచుకొనవలెను.**

ఎన్.మల్లిఖార్జునరావు
అమలాపురం, పిటీషనరు తరుపు అడ్వకేట్,
01-10-23. అమలాపురం.

సర్పంచ్ సూరిబాబు ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలను కాపాడ గలమని జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు అన్నారు. జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా జి.వేమవరంలో పుణ్యమంతుల సత్తిబాబు ఆర్థిక సహకారంతో సర్పంచ్ సూరిబాబు, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకుల శిబిరానికి చేరుకుని ఉత్సాహంగా రక్తదానం చేశారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలో రక్తం ఎంతో అవసరం ఉందని కాకినాడ ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ శ్రీహరిబాబు తెలిపారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన యువకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చింతా నారాయణమూర్తి, స్థానిక యువకులు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు, సర్పంచ్ సూరిబాబు